సాక్షి
పల్నాడు
గురువారం । 1 । జూన్ । 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1900, మోడల్ ధర రూ.1200 వరకు పలికింది.



రైల్వే స్టేషన్‌లో వార్షిక తనిఖీలు

విజయవాడ పశ్చిమ : రైల్వే ఏడీజీపీ కుమార్ విశ్వజిత్ బుధవారం విజయవాడలో పర్యటించారు. ముందుగా విజయవాడ రైల్వే ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి వార్షిక తనిఖీలు చేపట్టారు.



జలకాలాటలలో శిక్షణ

వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. విజయవాడలోని పున్నమీ ఘాట్ సమీపంలో చిన్నారులకు వాటర్ స్పోర్ట్స్‌లో బుధవారం శిక్షణనిచ్చారు.


కిలహాల నవ్వులు

'రైతు'కు పెట్టుబడి 'భరోసా'

- కర్షకులను ఏటా ఆదుకుంటున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- నేడు అట్టహాసంగా నగదు జమ
- 2,55,705 మందికి లబ్ధి
- రూ.140.96 కోట్ల మేర ప్రయోజనం
- మరో 3,224 మందికి రూ.2.94 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ



సేద్యమేవ జయతే : వరి నారు తీస్తున్న కూలీలు (పాతచిత్రం)



సాక్షి, నరసరావుపేట: సేద్యం సుభిక్షమవుతోంది. రైతు ఇంట సంక్షేమ సిరులు కురుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి కర్షకులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందించడమే కాకకుండా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి విత్తు నుంచి పంట విక్రయాల వరకు అండగా నిలుస్తోంది. గిట్టుబాటు ధర కల్పిస్తోంది. విపత్తులు సంభవించినప్పుడు పంట నష్టపోతే పరిహారం అందజేస్తోంది. అరుగాలం రైతుకు సూచనలు, సలహాలు అందిస్తోంది. ఉచిత బీమా పథకం అమలు చేస్తోంది. సూక్ష్మ సేద్య పరికరాలు అందజేస్తోంది. తాజాగా వరుసగా ఐదో విడత రైతు భరోసా సాయం అందించేందుకు జన హృదయ విజేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంసిద్ధులవుతున్నారు. గురువారం నగదు జమను ఆయన అట్టహాసంగా కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి ప్రారంభించనున్నారు. రైతుభరోసా– పీఎం కిసాన్ ద్వారా ఇప్పటికే నాలుగు విడతలుగా 1,375 కోట్ల మేర జిల్లాలోని రైతులకు లబ్ధిచేకూరింది.

ఖరీఫ్ సీజన్ కంటే ముందే

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఏటా ప్రభుత్వం రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందజేస్తోంది. ఈ ఏడాదీ గురువారం నగదు జమకు ఏర్పాట్లు చేసింది. పల్నాడు జిల్లాలో 2023–24 సంవత్సరానికి గాను 2,55,705 మంది రైతుల ఖాతాలలో పీఎం కిసాన్, వైఎస్సార్ రైతభరోసా ద్వారా రూ.140.96 కోట్లు జమ కానున్నాయి. ఇందులో 1,626 మంది ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా భూములలో సాగు చేస్తున్న రైతులు ఉన్నారు. ఇప్పటికే ఆర్‌బీకేల వారీగా లబ్ధిదారుల వివరాలు ప్రదర్శించారు. ఇంకా ఎవరైనా అర్హతుండి నగదు జమ కాకపోతే, ఆర్‌బీకేలలో ఫిర్యాదు చేయొచ్చు. ద్వైవార్షిక లబ్ధిలో భాగంగా జూలై నెలలో వారికి నగదు జమ అవుతుంది. రానున్న అక్టోబర్‌లో రెండో విడత ద్వారా రూ.4 వేలు, 2024 జనవరిలో మూడో విడతలో రూ.2 వేలు జమ కానున్నాయి.

పంటలు నష్టపోయిన 3,224 మంది రైతులకు పరిహారం

గత మూడు నెలల కాలంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టపోయిన రైతులకూ గురువారం నష్టపరిహారం జమకానుంది. గతంలో ఏళ్లు గడచినా నష్టపరిహారం వచ్చేది కాదు. ఈ ప్రభుత్వ హయాంలో ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్‌లో పరిహారం అందజేస్తున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలలలో కురిసిన వర్షాలకు జిల్లాలో మొత్తం 2,269.56 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అధికారులు లెక్కించారు. 3,224 మంది రైతులను బాధితులుగా గుర్తించారు. వీరి ఖాతాల్లో ప్రభుత్వం రూ.2.94 కోట్లను గురువారం జమ చేయనుంది.

రైతు బాంధవుడు జగన్



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు పెట్టుబడి నిమిత్తం అప్పులు చేయాల్సిన పనిలేకుండా వైఎస్సార్ రైతు భరోసా పేరిట ఏటా రూ.13,500 నగదును మా ఖాతాల్లో జమ చేస్తున్నారు. విత్తనాలు మొదలు.. ధాన్యానికి గిట్టుబాటు ధర లభించే వరకు ప్రతి దశలో రైతులకు అండగా నిలుస్తున్నారు. అందుకే మేమంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రైతు బాంధవుడిగా పిలుచుకుంటాం.

– అడపాల అంబారావు, రైతు, ఆత్మకూరు గ్రామం, దుర్గి మండలం

రైతుకు ప్రభుత్వ అండ



రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అందుకే ప్రభుత్వం రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం అమలు చేస్తోంది. ఈ ఏడాది తొలి విడతలో జిల్లాలో 2,55,705 మంది రైతులకు రూ.140.96 కోట్లు గురువారం జమ చేయనుంది. అర్హులైన ప్రతి రైతుకు నగదు జమ కానుంది. ఎవరికైనా నగదు జమకాకపోతే సంబంధిత ఆర్‌బీకేలలో సంప్రదించి లబ్ధిపొందవచ్చు.

–ఐ.మురళీ, జిల్లా వ్యవసాయాధికారి

నాలుగేళ్ల నుంచి రైతుభరోసా వస్తోంది



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కౌలు రైతు కార్డు ద్వారా రైతు భరోసా వస్తోంది. అధిక వర్షాలకు పంట దెబ్బతింటే నష్టపరిహారమూ అందుతోది. సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. బ్యాంకు రుణాలు అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో కౌలురైతులకు ఇలాంటివేమీ అందేవి కావు. ఈ ప్రభుత్వం చల్లగుండాలి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

– బొద్దు నాగరాజు, కౌలు రైతు, కొల్లిపర

న్యూస్‌రీల్

న్యాయ సలహా కేంద్రం తనిఖీ

నరసరావుపేట: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న న్యాయ సలహా కేంద్రాన్ని అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి మధుస్వామి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, సలహా కేంద్ర న్యాయవాది శ్రీరామినేని ప్రసాదు హాజరయ్యారు.

కొనసాగుతున్న పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పాలిసెట్–2023 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. గుంటూరు నగర శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో బుధవారం 234 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. గురువారం జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు 43,001 నుంచి 59వేల ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

డ్రై,లిక్విడ్ గంజాయిని నిర్వీర్యం చేయాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్వాధీనం చేసుకున్న గంజాయిని త్వరగా నిర్వీర్యం చేయాలని ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశించారు. మంగళగిరి రూరల్, పట్టాభిపురం, పొన్నూరు పోలీస్‌స్టేషన్ల (పీఎస్) పరిధిలో సీజ్ చేసిన డ్రై, లిక్విడ్ గంజాయిని బుధవారం పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌కు తరలించగా ఎస్పీ పరిశీలించారు. జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కంట్రోల్ కమిటీ చైర్మన్ హోదాలో కమిటీ సభ్యుల సమక్షంలో ఎలక్ట్రానిక్ పరికరంతో పరిశీలించారు. కొద్ది రోజులుగా ఆయా పీఎస్‌ల పరిధిలో స్వాధీనం చేసుకున్న సుమారు 476 కిలోల డ్రై/లిక్విడ్ గంజాయిని పద్ధతి ప్రకారం డిస్పోజల్ చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల రెండో తేదీ నుంచి జరగనున్న టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ పి.శైలజ బుధవారం తెలిపారు. ఈనెల 10న జరగనున్న పరీక్షలకు 5,422 మంది విద్యార్థులు దరఖాస్తు చేసినట్లు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులను ఉదయం 8.45 నుంచి 9.30 గంటలలోపే అనుమతిస్తామని స్పష్టం చేశారు. హాల్ టికెట్, పెన్ను మినహా మరే ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని డీఈఓ చెప్పారు.

వైద్య విభాగంపై 58 ఫిర్యాదులు పరిష్కారం

డిసిప్లీనరీ కమిటీ సమావేశం నిర్వహించిన కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా డిసిప్లీనరీ కమిటీ సమావేశంలో వైద్యవిభాగంపై వచ్చిన 58 ఫిర్యాదులను కమిటీ సభ్యులు పరిష్కరించారు. వీటిలో ఐదు ఏఎన్ఎం యాప్‌ల ద్వారానూ, మూడు మెడికల్ ఆడిట్ వింగ్ ద్వారా వచ్చాయి. ఐవీఆర్ఎ–104, మెడికల్ ఐవీఆర్ఎస్ అవుట్ బౌండ్ కాల్స్ ద్వారా నమోదైన 50 ఫిర్యాదులు ఉన్నాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ రోగులకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందించేలా యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సునీల, ప్రభుత్వ వైద్యశాల జిల్లా పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, రోటరీక్లబ్ సెక్రటరీ అచ్యుత్ పాల్గొన్నారు.

రత్నగిరి కాలనీలో జింక గుర్తింపు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరు రూరల్ మండల పరిధిలోని రత్నగిరికాలనీ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో బుధవారం అటవీ శాఖ అధికారులు జింకను పట్టుకున్నారు. స్ట్రైకింగ్ ఫోర్స్ సభ్యులు సతీష్ కుమార్, అబ్దుల్‌రహీంతోపాటు స్థానికులు సహాయంతో జింకను పట్టుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో జింకను వదిలేశారు. అమరావతి మండలం లేమల్లె అటవీ ప్రాంతం నుంచి నీటి కోసం వచ్చినట్లు ఆ శాఖ అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. వేసవి దృష్ట్యా దాహార్తి కోసం దారి తప్పి వచ్చే అటవీ జంతువులు కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని ఆయన చెప్పారు.

అసంతృప్తి 'కన్నా'రా

- సత్తెనపల్లిలో టీడీపీకి నాలుగో కృష్ణుడు
- కన్నా లక్ష్మీనారాయణకు ఇన్‌చార్జిగా బాధ్యతల అప్పగింత
- ఇప్పటికే వర్గపోరు పార్టీ శ్రేణుల్లో నిస్తేజం
- తాజాగా నాలుగు స్తంభాలాటకు అధిష్టానం ఆజ్యం
- కన్నాకు సత్తెనపల్లికి రావడం ఇష్టం లేదని టాక్



సత్తెనపల్లి: సత్తెనపల్లి టీడీపీలో ముసలం మరింత ముదరనుందా? ఇప్పటి వరకు సీటు తమదంటే తమదంటూ పావులు కదిపిన నేతలు.. ఇకపై తమ అసమ్మతి గళం వినిపించనున్నారా ? ఇప్పటికే ప్రజల్లో మెండైన సానుకూలతతో వైఎస్సార్ సీపీ బలంగా ఉంది. టీడీపీ సత్తెనపల్లి ఇన్చార్జిగా కన్నా లక్ష్మీనారాయణ ఇష్టపడే వస్తున్నారా? తప్పనిసరి పరిస్థితుల్లోనా! అనేది స్పష్టత కొరవడింది. పెదకూరపాడు కాని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని కానీ కన్నా ఆశించారనేది సన్నిహితుల మాట. మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇప్పటికే అధికార వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాల ద్వారా ప్రజల్లోకి బలంగా వెళుతోంది. అదే సమయంలో మహానాడు ద్వారా పార్టీకి ఉత్సాహాన్ని తీసుకొద్దామనుకున్న చంద్రబాబు.. కాపీ మేనిఫెస్టోతో బొక్కబోర్లా పడ్డారు. ఈ క్రమంలో పార్టీలో చేరిన మూడు నెలల తర్వాత సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు. ఈ మార్పుపై పార్టీలో భిన్నమైన టాక్ వినిపిస్తోంది.

నాలుగు స్తంభాలాట

గత ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కోడెల శివప్రసాదరావు ఓటమి పాలయ్యారు. ఆయన అకాల మరణంతో ఇన్‌చార్జి బాధ్యతలను అధిష్టానం ఎవరికీ అప్పగించలేదు. కోడెల శివప్రసాదరావు తనయుడు శివరామ్ పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. మన్నెం శివనాగమల్లేశ్వరరావు(అబ్బూరి మల్లి), మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు కూడా పార్టీ కార్యక్రమాలు చేపట్టడంతో మూడు గ్రూపులుగా విడిపోయారు. ఈ వర్గపోరుకు ఆజ్యం పోస్తున్నట్టు ఆ పార్టీ అధిష్టానం తాజాగా కన్నా లక్ష్మీనారాయణను సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. దీంతో మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, కోడెల శివరామ్, మన్నెం శివనాగమల్లేశ్వరరావు ఆందోళనలో ఉన్నారు. దీనివల్ల గ్రూపు విభేదాలు, అసంతృప్తులు మరింత పెరగడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కన్నాకు కాపు కాసేది లేదు...

తొలి నుంచి కన్నా లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1989, 1994, 1999, 2004లలో పెదకూరపాడు నుంచి గెలిచారు. 2009లో గుంటూరు పశ్చిమ నుంచి గెలుపొందారు. ఈ నేపథ్యంలో కన్నా గురి కూడా పెదకూరపాడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాలపైనే ఉందని ఆయన సన్నిహితుల మాట. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే కాపు సామాజికవర్గానికి చెందిన అంబటి రాంబాబు మంత్రిగా ఉన్నారు. ఇక్కడ అంబటి రాంబాబు తొలి నుంచి కాపులతోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అండగా నిలుస్తున్నారు. 2009లో టీడీపీ నుంచి ఓటమిపాలైన నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, ఆయనపై గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి (2004లోనూ గెలుపొందారు), కాపు సంఘ నేత పక్కాల సూరిబాబు వైఎస్సార్ సీపీలో చేరడంతో అధికారపార్టీ బలం పెరిగింది. ఈ నేపథ్యంలో సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా ఉండేందుకు కన్నా కూడా విముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.

9వ తరగతి విద్యార్థినికి వేధింపులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిని ఓ బైక్ మెకానిక్ వెంబడించి వేధించాడు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. కాకుమాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ హాస్టల్‌లో నివాసం ఉండే 9వ తరగతి విద్యార్థిని సెలవుల సందర్భంగా వడ్డేశ్వరంలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఇంటిపక్కనే ఉంటున్న బైక్ మెకానిక్ అమృత్ కుమార్ తరచూ బాలికను ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆ బాలిక తల్లిదండ్రుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అమృత్‌కుమార్‌పై పోక్సో చట్టం ద్వారా కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు వివరించారు.

వైభవంగా గోపీనాథస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ



విమాన శిఖర కలశాలకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి విడదల రజిని, కుమారస్వామి దంపతులు

చిలకలూరిపేట: పురుషోత్తమపట్నంలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోపీనాథస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, విశ్వరూపం, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రత్నన్యాసం, అగ్ని ప్రణయనం, కుంభారాధన, యంత్రస్థాపన తదితర పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విమాన శిఖర స్థాపన నిర్వహించారు. స్వామికి ప్రాణప్రతిష్ఠా, జీవకళాన్యాసం, ప్రత్యేక అలంకరణ, స్వామి దర్శనం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సహకారంతో దేవదాయ, టీటీడీ నిధులతో నిర్వహించిన పునఃప్రతిష్ఠా మహోత్సవంలో మంత్రితోపాటు ఆమె కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి కుటుంబ సభ్యులు విడదల లక్ష్మీనారాయణ, విడదల కుమారస్వామి, విడదల గోపీనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, రామచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మురికిపూడి శ్రీనివాసాచార్యులు, మురికిపూడి శ్రీమన్నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు హోమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

మద్యం విక్రేతపై పీడీ యాక్ట్

- నిందితుడు హరికృష్ణ అరెస్ట్
- రాజమండ్రి జైలుకు తరలింపు

నరసరావుపేట: నాటుసారా, పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తూ అనేక కేసుల్లో పట్టుబడిన బంగ్లా హరికృష్ణను ప్రివెంటీవ్ డిటెన్షన్ చట్టం–1950(పీడీ) కింద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) పోలీసులు అరెస్టు చేసి బుధవారం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.చంద్రశేఖర్‌రెడ్డి సారథ్యంలో పమిడిపాడుకు చెందిన హరికృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు. హరికృష్ణ నాటు సారా తయారీతో పాటుగా తెలంగాణ, గోవాల నుంచి మద్యం తీసుకొచ్చి ఈ ప్రాంతంలోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నాడని చెప్పారు. ఇతడిపై ఐదు కేసులు నమోదు అయినట్లు వివరించారు. ఈనేపథ్యంలో పీడీ యాక్టు అమలు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో అండర్–19 బాల బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు సి.హెచ్. రవీంద్రరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం స్థానిక రాజేంద్ర నగర్‌లో 3వ లైన్లోని విజన్ జూనియర్ కాలేజీలో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 79816 64035 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఆయిల్‌మిల్లులపై అధికారుల దాడులు



నరసరావుపేట: పట్టణంలోని రెండు ఆయిల్‌మిల్లులపై ఫుడ్‌సేఫ్టీ, పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించి శాంపిళ్లను సేకరించారు. జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. వంటనూనెల్లో వచ్చిన కల్తీల ఆరోపణలపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ ఇచ్చిన ఆదేశాలతో మంగళవారం పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలోని చాముండేశ్వరీ ఆయిల్‌మిల్లు, చిలకలూరిపేట రోడ్డులోని కేసానుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిశ్రీ ఆయిల్‌మిల్లుల్లోని తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. వాటి నుంచి శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌లోని స్టేట్‌ఫుడ్ లేబొరేటరీకి పంపించామన్నారు. దాడుల్లో పౌరసరఫరాల శాఖ టీడీ కొండారెడ్డి పాల్గొన్నారు.

పనితీరు మెరుగుతో సత్వర సేవలు

- పంచాయతీరాజ్ కమిషనర్ సూర్య కుమారి
- లింగారావుపాలెం సచివాలయం ఆకస్మిక తనిఖీ



లింగారావుపాలెం సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యకుమారి

యడ్లపాడు: ప్రజా సమస్యల పరిష్కారం.. రికార్డుల నిర్వహణలో ఎప్పటికప్పుడు తమ పనితీరును మెరుగు పరుచుకుకోవాలని పంచాయతీరాజ్ (సచివాలయ విభాగం) కమిషనర్, పల్నాడు జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం లింగారావుపాలెంలోని గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. అదే ప్రాంగణంలోని ఆర్‌బీకే, వైఎస్సార్ వెల్‌నెల్ హెల్త్ సెంటర్‌లలో ఉన్న ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పశుసంవర్థక, విద్య, వైద్యశాఖలకు చెందిన గ్రామ సహాయాలను చెక్‌లిస్ట్ ఆధారం వివరాలు రాబట్టారు.

ప్రతి శాఖ.. ప్రతి ఉద్యోగి నుంచి వివరాలు...

అన్ని శాఖల అధికారులు, గ్రామస్థాయి సహాయకులను ఒకేచోట ఉంచి ఆయా అన్ని శాఖలకు చెందిన సమగ్ర వివరాలు ప్రతి ఉద్యోగి నుంచి విధిగా అడిగి తెలుకున్నారు. అవి వారి సమయా పాలనా, విధులు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారా లేదా.. స్పందనలో వివిధ శాఖల వారీగా వచ్చిన వినతులు, వాటిలో పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవి, ఎందుకు ఉన్నాయంటూ ప్రశ్నలతో అధికారుల్ని ఉక్కిరిబిక్కిరి చేశారు. గ్రామాల్లో వ్యక్తిగత, సామాజిక పరమైన సమస్యలు ఏమున్నాయి..అభివృద్ధి పనులు ఏమేమీ చేస్తున్నారంటూ ప్రశ్నించారు. గత ఏడాది సీడ్స్, ఎరువులు పంపిణీ వివరాలు, పలు పంట ఉత్పత్తులను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసిన విషయాలపై ఆరా తీశారు. పత్తి, మిరపతో పాటు చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ఆర్‌బీకేల్లోని కియోస్కోల ఉపయోగంపై వివరించాలన్నారు. డెయిరీ ఫామ్స్ ఎన్ని, పాలసేకరణ ఎంత శాతం చేస్తున్నారు. అందులో వెన్నశాతమెంతా అంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నిర్లక్ష్యం..అలసత్వం వహిస్తే చర్యలే...

గ్రామ సచివాలయాన్ని సేవాలయంగా భావించి అందులో పనిచేసే ప్రతి ఉద్యోగి బాధ్యతగా ప్రజలకు ఉత్తమ సేవలను అందించాలని కమిషనర్ సూర్యకుమారి చెప్పారు. సమయపాలన నుంచి సమస్యల పరిష్కారం వరకు సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించిన విధంగా అందర్ని సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలని కోరారు. ప్రజా సంక్షేమ కార్యాక్రమాలతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె.వెంకటరెడ్డి, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, డీజీపీఓ భాస్కర్‌రెడ్డి, డీఏఓ ఐ.మురళి, నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ, హౌసింగ్ ఈఈ శివలింగం, డీఈఈ వెంకటరావు, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరారవు, ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, ఈఓఆర్‌డీ బృందావనం వరూధిని, వైద్యాధికారి గోపీనాయక్, సీడీపీఓ జి.శాంతకుమారి, సర్పంచి షేక్ కరీమూన్, ఎంపీటీసీ వీరారాఘవయ్య, కార్యదర్శి సురేష్, ఏఓ సరిత, ఏపీఓ జీవన్, ఏపీఎం విజయకుమారి పాల్గొన్నారు.

వరికపూడిసెలకు రెండో వారంలో శంకుస్థాపన

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- మండలాభివృద్ధికి రూ.934 కోట్లు
- చంద్రబాబును ప్రజలు నమ్మరు



వలంటీర్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: ఈ నెల 2వ వారంలో వరికపూడిసెల ఎత్తిపోతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించనున్నట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని కండ్లకుంటలోని ఏపీ మోడల్ స్కూల్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రాజెక్టుకు రూ.1,625 కోట్లను కేబినెట్ ఆమోదం లభించిందని చెప్పారు. 2016 మే 2న మాచర్లలో నిర్వహించిన కరువు ధర్నా కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అన్నీ రకాల అనుమతులను తీసుకురావటం జరిగిందని వివరించారు. ఈ అనుమతులు తీసుకురావానికి సీఎం వైఎస్ జగన్, ఎంపీ లావు కృష్ణదేవరాయలతో పాటు తాను కూడా ఎంతో కృషి చేశానన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. 2018లో ఎన్నికల ముందు రూ.340కోట్లతో ప్రాజెక్టు పనులు చేపడతామని చెప్పి, టీడీపీ హయాంలో అసెంబ్లీ సాక్షిగా ప్రాజెక్టు నిర్మాణ పనులపై ప్రశ్నించగా ఈ ప్రాజెకు పర్యావరణం, అటవీశాఖ అనుమతులు లేవని లిఖితపూర్వకంగా జవాబిచ్చారన్నారు. గత ప్రభుత్వాలు అభివృద్ధి ఎలాంటి దృష్టి పెట్టకుండా ఇప్పుడు ప్రజలను మోసం చేస్తూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. నక్కజిత్తుల చంద్రబాబు మహానాడులో హామీలు ఇస్తున్నారన్నారు. మండలంలోని కొత్తపుల్లారెడ్డి గూడెం, కండ్లకుంట, గుండ్లపాడు, బోదిలవీడు, శ్రీరాంపురంతండా సచివాలయాల పరిధిలో 87 మంది వలంటీర్లకు సన్మానం చేశారు. తొలుత సీఎం జగన్ చిత్రపటాని క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ గురుబ్రహ్మం, ఎంపీపీ చింతా శివరామయ్య, వెల్దుర్తి, మాచర్ల, జెడ్పీటీసీ రూప్లీబాలునాయక్, మల్లు స్వామి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ ఎ.సంజీవరెడ్డి, కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు టి.పుల్లారెడ్డి, ఎంపీడీఓ డి.ప్రసాద్, సర్పంచులు పిన్నెల్లి వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, తోట నారాయణ, పి.కృష్ణకుమారి, డి.ఏగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.పాపిరెడ్డి, కె.పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, టి.శివారెడ్డి, ఈ.వెంకయ్య పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై యంత్రపరికరాలు

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి



మాట్లాడుతున్న సలహా మండలి జిల్లా చైర్మన్ మార్కొండారెడ్డి

నరసరావుపేట: జిల్లాలోని రైతులకు వ్యక్తిగత సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో వ్యవసాయ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. అధ్యక్షత వహించి మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు రైతులకు సరఫరా చేయాలని, కౌలు రైతులకు కార్డులు త్వరంగా అందజేసి ప్రభుత్వ పథకాల ద్వారా వారికి లబ్ధిచేకూర్చాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో రైతుల నుంచి వచ్చే సందేహాలకు సలహా మండలి సభ్యులు, అభ్యుదయ రైతులు చర్చించుకొని రైతులకు నివృత్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ ఆర్‌బీకేల ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు 50శాతం రాయితీపై అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 3,500 క్వింటాళ్ల సరఫరా చేశామని, ఇంకా కావాల్సినంత సరఫరా చేస్తామన్నారు. ఆర్‌బీకేలు, సచివాలయాల గోడౌన్లలో 10 నుంచి 20 మెట్రిక్ టన్నుల చొప్పున రాబోయే సీజన్‌కు ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా వివిధరకాల ఎరువులు నిల్వచేస్తున్నామన్నారు. జిల్లాలోని 137 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు మెగా మేళా–2 ద్వారా 137 ట్రాక్టర్లు, వివిధ రకాల యంత్రపరికరాలు జూన్ రెండున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీద అందజేయటం జరుగుతుందని వ్యవసాయాధికారి వెల్లడించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



నరసరావుపేట: పొగాకు, వాటి ఉత్పత్తులైన చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా, ఖైనీ వంటి వాటిని త్రాగటం, తినటం వలన నోటి క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధులు వస్తాయని అటువంటి వాటికి దూరంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎండీహెచ్‌ఓ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి సూచించారు. 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని బుధవారం ఆమె ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు అందరితో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ పల్నాడు బస్టాండ్ వరకు ప్లకార్డులను ప్రదర్శిస్తూ పొగాకు ఉత్పత్తులను వాడరాదని నినదిస్తూ కొనసాగింది. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, ఎస్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ హనుమకుమార్, మెటర్నల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగ పద్మజా, డీఎంఓ రవీంద్ర రత్నాకర్, డెప్యూటీ డీఎంఓ సాంబశివరావు, డీపీహెచ్‌ఎన్‌ఓ సురేఖ, హెచ్‌ఈ కాజావలి, సోషల్ వర్కర్ నందిగామ సురేష్ పాల్గొన్నారు.

భవిష్యత్ సేంద్రియ వ్యవసాయానిదే

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



అత్తలూరులో సేంద్రియ వ్యవసాయంపై ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ శివశంకర్

అమరావతి: వ్యవసాయరంగం భవిష్యత్ సేంద్రియ వ్యవసాయంతో ముడిపడి ఉందని సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం అందించే సహకారాన్ని అందిపుచ్చుకుని రైతులు లాభాలు గడించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అత్తలూరులో అత్తలూరు పాలెం ఆర్గానిక్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఎండీ నూతలపాటి సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుసదస్సులో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు విచక్షణారహితంగా వాడి భూమి జీవరహితమైందన్నారు. జీవం ఉన్న భూమిని మనం వారసత్వంగా అందించాలంటే ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులలో వ్యవసాయంతో చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని ప్రతిరైతు భరోసా కేంద్రంలో సేంద్రియ వ్యసాయ స్టాల్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. అలాగే జిల్లా కేంద్రమైన నర్సారావుపేట కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమం వద్ద సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌కు మంచి స్పందన లభిస్తుందన్నారు. ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించటానికి అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని వీటిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 30వేల మంది రైతులు సేంద్రియ వ్యసాయం చేస్తున్నారని, ఈసంఖ్యను 50వేలకు తీసుకు వెళ్లటమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌చే వెయ్యి పీఎండీఎస్ కిట్లను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతు సాధికారసంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో పాడి గణనీయంగా తగ్గిపోవటం వల్ల రసాయన ఎరువుల వాడకం పెరిగి భూమిలో రసాయన సమతుల్యత లోపించిందన్నారు. ఎరువులు, పురుగు మందులు ఇష్టారాజ్యంగా వాడితే అది మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. రైతులు సేంద్రియ ఉత్పత్తులను వాడాల్సిన ఆవశ్యకత పెరిగిందన్నారు. పీఎండీఎస్ కిట్లలో ఉన్న 30రకాల విత్తనాలను ఖరీఫ్ పంటలకు ముందు విత్తటం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో అనుసరించాల్సిన 9 సార్వత్రిక సూత్రాలను ఆయన రైతులకు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమార్, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా ఉద్యాన శాఖాధికారి బెన్నీ, రైతు సాధికార సంస్థ రీజనల్ కో–ఆర్డినేటర్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి ప్రసంగించారు.

హజ్ యాత్రికుల బసకు ప్రత్యేక ఏర్పాట్లు

- రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు 1790 మంది
- మదరసాలో ఏర్పాట్లను పరిశీలించిన డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా



వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా తదితరులు

పెదకాకాని: పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లేవారు తొలిసారిగా గన్నవరం ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్ నుంచి బయలు దేరుతారని రాష్ట్ర డెప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, నంబూరు మదరసా ఏ సిరాజుల్ ఉలూమ్‌లోని హజ్ యాత్రికులు బస చేసేందుకు జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు హజ్ యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గన్నవరం ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1790 మంది హాజీలు హజ్ యాత్రకు బయలుదేరి వెళుతున్నారని వివరించారు. మదరసా ఏ సిరాజుల్ ఉలూమ్‌లో ఏర్పాటు చేసిన హజ్ క్యాంపునకు 24 గంటలు ముందుగా హాజీలు రిపోర్టు చేసి లగేజీ హ్యాండోవర్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ అధికారుల సూచనల మేరకు హజ్ యాత్రికుల లగేజీ కోసం స్ట్రాంగ్‌రూం, లగేజీ స్కానింగ్ మిషన్‌రూం, ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. గన్నవరం నుంచి జూన్ 7వ తేదీన 170 మంది యాత్రికులతో జద్దాకు ఒక విమానం వెళుతుందన్నారు. వారందరికీ ఇక్కడ వసతులు కల్పించడం జరిగిందని వారితో పాటు వచ్చే బంధువులకు హజ్ క్యాంప్ వెలుపల వసతి సౌకర్యం కలిగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భోజనాలకు సంబంధించి అన్ని పనులు కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పగించడం జరిగిందని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్రం నుంచి వెళుతున్న హాజీలకు ప్రయాణ తేదీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసినట్లు చెప్పారు. ఈనెల 7 నుంచి 19వ తేదీ వరకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రతిరోజూ ఒక విమానం బయలు దేరుతుందని వెల్లడించారు. ఇప్పటికే హజ్ కమిటీ ద్వారా ప్రయాణికులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. లగేజీ మదరసాలోనే స్కానింగ్ చేసి బోర్డింగ్ పాస్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. హజ్ యాత్రికులు సౌకర్యాలు కల్పించేందుకు మైనార్టీ సంక్షేమశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారన్నారు. హజ్ క్యాంపు వద్ద ఏర్పాట్లను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయూబ్ హుస్సేన్‌ను నియమించడం జరిగిందన్నారు. తొలిసారి ప్రతిష్టాత్మకంగా ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్న యాత్రికులను కలిసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించడం జరిగిందన్నారు. హజ్ క్యాంపు వద్ద ఇప్పటికే ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. మదరసాను సందర్శించిన వారిలో వక్ఫ్‌బోర్డు సీఈఓ ఖాదర్‌వలి, హజ్ కమిటీ చైర్మన్ గౌసమ్‌అజామ్, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎస్ఎం జియావుద్దీన్, హజ్ కమిటీ డైరెక్టర్ బాసిత్, గుంటూరు నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ అయూబ్‌హుసేన్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, పెదకాకాని తహసీల్దార్ పి.రత్నం, దర్గా ఈఓ ముక్తార్ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్ఎం సుభాని, గులాం రసూల్, పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని, మైనార్టీశాఖ అధికారులు, హజ్ కమిటీ సభ్యులు, మదరసా నిర్వాహకులు ఉన్నారు.

కారు డ్రైవర్‌కు దేహశుద్ధి




ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుభాగం (ఇన్‌సెట్) కారు డ్రైవర్

చేబ్రోలు: మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్‌కు స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన వడ్లమూడిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రెండు ఆటోలు, నాలుగు బైక్‌లు, రోడ్డు పక్కన వెళ్తున్న వారిని ఢీ కొట్టడంతో ఆరుగురికి గాయపడ్డారు. నారాకోడూరుకు చెందిన సుమన్, తెనాలి నుంచి నారాకోడూరు వస్తూ సంగం జాగర్లమూడి సమీపంలో ఓ బైక్‌ను ఢీ కొట్టాడు. గరువుపాలెం వంతెన వద్ద ఆటోను ఢీ కొట్టాడు. అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు పక్కను వెళ్తున్న వారిని, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టాడు. వడ్లమూడి అడ్డరోడ్డు వద్ద కారును స్థానికులు, యువకులు వెంబడించారు. గౌడపాలెం ప్రభుత్వ పాఠశాల వద్ద గోడను ఢీ కొట్టి కారు నిలిచిపోవడంతో డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పచెప్పారు. మద్యం మత్తులో కారును నడపటమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. చేబ్రోలు ఎస్ఐ వెంకటాద్రి కేసు నమోదు చేశారు.

ప్రజలకు మంచి చేయాలన్నదే సీఎం జగన్ సిద్ధాంతం

రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు పి.నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న పి.నాగార్జునరెడ్డి

కొల్లిపర(తెనాలి): నమ్మిన సిద్ధాంతాలను వాస్తవరూపంలోకి తీసుకొచ్చి ప్రజలకు మంచి చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటారని, చంద్రబాబు పాలసీ మాత్రం నిత్యం అబద్ధాలు చెప్పటం, నమ్మినవారిపై చేతులు పెట్టి నట్టేట ముంచటమేనని రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు పి.నాగార్జునరెడ్డి అన్నారు. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఉపాధిహామీ పనుల్నుంచి జగనన్న కాలనీలు, రైతు భరోసా కేంద్రాల్నుంచి, సచివాలయాలు, ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సహా పరిశీలించారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం కలెక్షన్ సెంటర్‌కు వెళ్లి, సంఘ పనితీరును స్వయంగా చూశారు. భోజన విరామ అనంతరం ఎంపీపీ కార్యాలయంలోని సమావేశపు హాలులో వివిధ సమావేశాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బావమరిది హరికృష్ణ రాజ్యసభకు రాజీనామా చేసినపుడు, కారణం తెలుసుకుని కొనసాగేలా చూడకుండా, కనీసం అడగలేదని ఎద్దేవా చేశారు. అలాంటి చంద్రబాబు ఇప్పుడు ప్రజలను పట్టించుకుంటానంటూ తిరుగుతుంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. రాజధానిలో పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తుంటే కోర్టులో కేసులు వేయించారని, ప్రతి విషయంలోనూ అడ్డుపడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని చెప్పారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని నిందలేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి, తెనాలి మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల నేత ఆరిగ చంద్రారెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు తమ్మా సుజాత వేదికపై ఉన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్



బందోబస్త్‌పై పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: ఈనెల 2న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు నగర పర్యటన దృష్ట్యా పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. సీఎం పర్యటన దృష్ట్యా నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆయన పర్యటించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ చుట్టు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. సరిపడా పోలీస్ సిబ్బందితో పహారా నిర్వహించాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి చుట్టుగుంట సర్కిల్ వెళ్లే మార్గంలో ఇరువైపులా భద్రతా బలగాలతో అణువణువు గాలిస్తూ, ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని అన్నారు.

ప్రత్యేక బలగాలతో హెలిప్యాడ్, చుట్టుగుంట సర్కిల్ వద్ద జరగనున్న సభ పరిసర ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ ఒక్కరూ విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని అన్నారు. సమావేశంలో ఏఎస్పీలు ఎన్.షెల్కే(గుంటూరు తూర్పు), కె.సుప్రజ(పరిపాలన), కె.శ్రీనివాసరావు (ఎల్‌అండ్ ఓ), శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు పోతురాజు, బాలసుందరరావు, సుభాష్, ఉమామహేశ్వరరెడ్డి, జనార్దన్‌రావు, కేసీహెచ్ రామారావు, శ్రీనివాసరావు, ఎస్‌బీ, డీసీఆర్‌బీ సీఐలు నరసింహారావు, శ్రీనివాసరావు, బాలసుబ్రహ్మణ్యం, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు, ఆర్ఐలు పాల్గొన్నారు.